# దేవమ్మ

రామదాసు హుషారుగా రిక్షా తొక్కుకుంటూ గంట గణగణ మోగించుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు.

అతనేం 'జనసమ్మర్దమైన రోడ్డు' మీంచి పోకపోయినా అతని ఆనందానికి చిహ్నంగా గంట మోగించుకుంటున్నాడు.

మొదటి ఆట సినిమా వదిలేయడం, రెండో ఆట మొదలుపెట్టడం అయింది. సుమారు రాత్రి పదిన్నర దాటింది.

'రిక్షా వస్తావా' అంటూ యిద్దరు ముగ్గురు అడిగినా దాసు 'రాదండి-రాదండి' అని తాళయుక్తంగా చెప్పుకుంటూ దూసుకుపోతున్నాడు.

లక్ష్మీటాకీసులోంచి సినిమా మాటలు గట్టిగా బయటరోడ్డు మీదకి వినిపిస్తున్నాయి.

'ఛ! కులటా! నీ ముఖం నాకు చూపించకు. ఫో బయటికి ఫో!' అంటూ అరుస్తోంది పురుష కంఠం.

దాసు ఆ చిత్రం నిన్ననే చూశాడు. సన్నివేశం గుర్తుకొచ్చింది. నిట్టూర్చాడు. ఆడదంటె మగాడికెంత లోకువ అనుకున్నాడు. అంతలోనే మళ్ళీ తన ఉత్సాహంలో పడిపోయాడు. మనసంతా ఆనందంతో పురకలు వెయ్యడం మొదలుపెట్టింది.

అతను ప్రొద్దుట ఆరున్నరకి రిక్షా వేసుకుని యింట్లోంచి బయటకొచ్చాడు. సొంతబండి కావటం వల్ల అద్దె కట్టే బాధలేదు. రెండింటికో, నాలుగింటికో షావుకారికి బండి వొప్పగించాలనే బెంగ లేదు-

అతనికి ఆ రోజు తనని వరించిన అదృష్టదేవత గుర్తుకొస్తోంది. పొద్దున్నే తన రిక్షా ఎక్కినామె అతనికి పదే పదే గుర్తుకొస్తోంది. అచ్చంగా ఆమె ఆకాశంలోంచి

దిగివచ్చిన దేవతలాగా వుంది. అప్పుడే విరిసిన ముద్ద నందివర్తనం పువ్వులా తెల్లని బట్టల్లో స్వచ్ఛంగా అందంగా వుంది.

నిజానికి బోణీబేరం కదాని రెండు రూపాయలకి తగ్గని బేరం రూపాయిన్నరకే వెళ్ళాడు. కాని ఆయమ్మ బండిలో కాలెట్టిన లగాయితూ ఎన్ని బేరాలు తొక్కాడు? అదేమిటో ఎక్కిన వాళ్ళంతా తనెంత అడిగితే అంతా యిచ్చేశారు. ఒక్కొక్కసారి తను మరి దిలాసాగా ఎక్కువే అడిగినా అది యిచ్చేసి ఎక్కారు. మధ్యాహ్నం కూడుతినేందుకు కూడా టైము దొరకలేదు. బజ్జీలు తిని టీ తాగాడు - సాయంత్రం ఆరుగంటలకి రెండు జొన్నపొత్తులు కొనుక్కుని తిన్నాడు. నిజానికి కడుపులో ఆకలి కంటె ఆనందం ఎక్కువగా వుంది. యాభై మూడు రూపాయలు వచ్చాయి. మూడ్రూపాయలు పెట్టి కరకజ్జం కొని సీటుకింద పెట్టాడు. ఇంట్లో ఆడదివేళ గుమ్మెత్తిపోవాలి.

దాసుకి చిన్నప్పటినుంచి బోణీ అనేది ఎంతో నమ్మకం. బోణీ మంచిదయితే విశ్రాంతి వుండదు. లక్ష్మీ ఘల్లు ఘల్లుమంటూ వస్తుంది. ఒక్కొక్క ముదనష్టపు బోణీపడిన రోజున ఎక్కడికెళ్ళినా దరిద్రమే - ఇది దాసు నమ్మకం.

అందుకే దాసుకివేళ తెల్లబట్టల దేవమ్మ బాగా గుర్తుకొస్తోంది. ఆమె స్కూలుకి బయలుదేరేవేళ చూసి, పదిపైసలైనా ఆమెని తన రిక్షాలో ఎక్కించుకుని తీసుకుపోవాలి. అమె కాలుమోపిందంటె చాలు. అదే పదివేలు.

మరుసటిరోజూ ఆపై రోజూ కూడా దేవమ్మని టైముకి పట్టుకోలేకపోయాడు. ఆమె ముందే వెళ్ళిపోయిందో, మరేమైందో తెలీదుగాని అతనికామె తటస్థపడలేదు. దానికి తగ్గట్టుగా అతనికారెండు రోజులూ బేరాల్లేవు. పన్నెండు రూపాయలు రావడం గగనమైంది.

దేవమ్మ బోణీ మీద అతనికి మోజు మరీ ఎక్కువైపోయింది. మూడో రోజు అతను తెలతెలవారుతుండగానే బయలుదేరి రోడ్డు మొగసాలనిలిచాడు. దూరంగా ఆమె కనిపించగానే అతనికి సాక్షాత్తు అదృష్టదేవత కదిలివస్తున్నట్లనిపించింది. ఆమె పక్కన హుందాగా, నిండుగా వున్నాయన్ను చూసి 'బాబుగారు' అనుకుని బండి తీసి వుత్సాహంగా ఎదురెళ్ళాడు.

తీరా దగ్గరకెళ్ళాక తెలిసింది, ఆమెందుకో చాలా కోపంగా వుంది. ధుమధుమ లాడుతూ రిక్షా ఎక్కింది. అతని ముఖం అశాంతిగా, ముభావంగా వుంది. అతనూ ఎక్కాడు - దాసులో ఉత్సాహం చచ్చిపోయింది. తెల్లని మల్లెపువ్వులాంటి బట్టల్లో వున్న దేవమ్మ చిరచిరలాడుతుంటే ఎలాగో అయింది. బండి వేగాన్ని పుంజుకుంది.

బాబుగారు మాత్రం ఆమెని సముదాయించే ధోరణిలో నెమ్మదిగా మొదలు పెట్టాడు.

"ప్రతి చిన్న విషయానికి నువ్విలా కోపగించుకుంటే ఎలా?"

ఆమె గయ్యిమని లేచింది. "నా ఖర్మేం పట్టింది. నా యిష్టమొచ్చినట్లు నేనుంటాను. నాకు మీరేం పెట్టి పోషించలేదు. నా అన్నం నే తింటున్నా. నా యిష్టం వచ్చినట్లుంటాను" ఆమె గొంతులో ధ్వనించిన ఛీత్కారానికి బాబుగారెలా బాధపడ్డాడో గాని దాసు మాత్రం విలవిల్లాడిపోయాడు. దేవమ్మ మాట్లాడే పద్ధతి దాసుకెంతమాత్రం నచ్చలేదు. నెమ్మదిగా బాబుగారన్న మాటలకి మళ్ళీ గొంతు చించుకుంది.

"మీ హద్దుల్లో మీరుండండి. నాకేం చెప్పక్కరలేదు. మిమ్మల్ని కట్టుకున్నందుకు నా ముఖాన ఏ సుఖమూ లేదు. ఎంతసేపూ మీ వాళ్ళూ, మీ గోలే" అంటూ అతన్ని మరింత ఈసడించింది. విదిలించి పారేసింది. ఆమె గొంతు రోడ్డు మీద పోయేవారు కొందరు ఆశ్చర్యంగా విని ముందుకెళ్ళిపోయారు.

దాసుకి వొళ్ళుమండిపోయింది. దేవమ్మ యిలా మాట్లాడ్డం అతనికెంతో అవమానమనిపించింది. బాబుగారు గంటుముఖం పెట్టుకుని కూర్చుని వుంటారని చూడకుండానే గ్రహించాడు దాసు. ఓరకంటతో చూడనూ చూశాడు. ఇద్దరూ ఎడముఖం, పెడముఖం పెట్టుకుని కూర్చున్నారు. మాటలబట్టి చూస్తే అమ్మగారిదే తప్పనిపించింది దాసుకి. భార్యాభర్తలన్నాక పోట్లాటలూ తప్పవు పొంగిపోవడాలూ తప్పవు. అయినా పెళ్ళామిలా మొగుడ్ని తీసిపారేయకూడదనిపించిందతనికి.

రిక్షా ఆగింది. ఆమె వురికినట్లు దిగి స్కూల్లో కెళ్ళిపోయింది. బాబుగారు మాత్రం డబ్బులిచ్చి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

పూర్తిగా గొడవేమిటో తెలీకపోయినా దేవమ్మ అలా మాట్లాడకూడదనిపించింది దాసుకి - అదే తనైతే సిగపాయితీసి తన్నేసేవాడు. నిజంగా బాబు శాంతమూర్తే అనుకున్నాడు -

ఆ రోజు కూడా దాసుకి డబ్బులు గలగల రాలాయి.

రాత్రి వేడి వేడి అన్నంలో వుల్లికారం కలుపుకుని అన్నం తింటూ దుర్గతో సినిమా కథలాగా యిదంతా చెప్పాడు దాసు.

"ఏంటయ్యా? అట్టాగంటావు? ఎంత బాధైందో - లేపోతే అయమ్మ అంతలేసి మాటలంటుందా" అంది దుర్గ.

'మనకేటి తెలీదనుకో అయిన అంతలేసి మాటలనకోడదే దుర్గా, అంత దులపరిస్తే ఏంబాగుంటుంది?" అన్నాడు.

"అవునూ! నిజవేఁ ఆమెగారు సంపాదించుకుంటావుంది. దరిజాగా బతుకుతా వుంది. అందుకనలా అంది" అంటూ సమర్థించింది దుర్గ.

"ఎన్నైనా చెప్పు నేనైతే నాలుగంటించివాడ్ని. సంపాదిస్తే మాత్రం సచ్చినట్టు పడుండాలి పెళ్ళావంటే" అన్నాడు అతని మాటల్లో కొంటెతనం ధ్వనించింది.

"ఎందుకు పడుండాలయ్యా? నాలుగు తన్ని సూడు. నేనుంటానేమో సూద్దువు గాని" అంది.

"నువ్వలాంటిమాటలెన్నడైనా అన్నావా" అన్నాడు. దుర్గ పొంగిపోయింది.

"సాల్లేవయ్యా! ఆయన్ని సదువుకున్నోళ్ళ గొడవలు. ఆళ్ళే సూసుకుంటారు" అంది సర్దిచెప్తున్నట్లు.

దాసు నవ్వాడు "ఆళ్ళే సూసుకోక మనం సూస్తామా ఏంటి?" అన్నాడు.

దుర్గేం మాట్లాడలేదు.

"ఏదైనా ఆయమ్మ కాలెట్టిందంటే బండిలో ఆరోజు కాసులు రాలాల్సిందే" అన్నాడు ఆవులిస్తూ.

"ఎవురి పిచ్చి ఆరి కానందం" అని ముక్తాయించింది.

❖ ❖ ❖

ఆ తర్వాత దేవమ్మ దాసు రిక్షా రెండు మూడుసార్లెక్కింది. ఒసారి ముచ్చటగా ఇద్దరే పిల్లల్ని తీసుకునెక్కింది. మరోసారి మొగుడితో ఎక్కింది. రిక్షా నడిచినంతసేపు కొట్లాట జరుగుతూనే వుంది. బాబుగారు బ్రతిమాలుతూనే వున్నాడు. ఆయమ్మ రెచ్చిపోతూనే వుంది. దాసుకి వొళ్ళు మండిపోతూనే వుంది -

అయితే ఆ రోజు కాసులు మాత్రం బాగా రాలాయి.

❖ ❖ ❖

ఆ రోజు డిసెంబరు ముప్పై ఒకటి. పొద్దుటనుండి ఒకటే వాన కురిసి కురిసి సాయంత్రం నాలుగ్గంటలకి ఆకాశం తెరిపిన పడింది. ప్రజల్లో వుత్సాహం మేల్కొంది. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పాత సంవత్సరానికి వీడ్కోలు -పార్టీలు- హడావిడి అన్నీ ఈ వర్షంలో కొట్టుకుపోయాయని బెంగపెట్టేసుకున్న రసజ్ఞులందరికి ప్రాణాలు లేచివచ్చాయి.

పొద్దుట నుంచి వానతో విసిగిపోయిన దాసు ఆనందంగా బండితీశాడు. ఆ రోజు రాత్రి హడావిడి వుంటుంది. నాలుగు బేరాలు తగిలితే వుషారుగా వుంటుందని బయలుదేరాడు.

"ఇయ్యాల రాత్రంతా రాను. తెల్లారొస్తా. తలుపేసుకు పడుకో" అని యింట్లో చెప్పేసి మరి బయలుదేరాడు దాసు.

చీకటిపడిన కొద్దీ జనసంచారం పెరుగుతోంది. న్యూయియర్ కేక్స్ క్షణాల మీద అమర్చారు బ్యాకరీలవారు. బారులన్నీ ఆర్భాటంగా సన్నాహాలు మొదలుపెట్టాయి. బ్రాందిషాపుల్లో దీపాలు వెలిగాయి.

ఆ మారుమూల సందులో ఎవరో కాలేజీ కుర్రాళ్ళని దింపి వస్తున్నాడు దాసు. అప్పుడు రాత్రి పది దాటింది. దూరంగా దీపస్తంభంకి ఎడంగా రెండు ఆకారాలు నిలబడి వున్నాయి. ఒకరికొకరు దగ్గరగా, ఏదో గుసగుసలాడుకుంటున్నట్లు మాటలు. దాసు ముందుకు పోబోయి నెమ్మదిగా బండి ఆపాడు.

"వస్తావా రిక్షా!" అన్న మాటలు విని సీటుమీంచి దిగాడు. క్రీనీడలో చిన్న సూట్‌కేసుతో నిలబడిన దేవమ్మని చూసి గతుక్కుమన్నాడు. తుళ్ళిపడి పక్కనున్న మనిషిని చూశాడు, బాబుగారు కాదు. నల్లగా వున్నాడు. కళ్ళకి జోడు. రింగుల క్రాపు-గళ్ళలాల్చి - నోట్లో కిళ్ళీ - దొంగకోళ్లు కొట్టేవాటంగా అనిపించింది దాసుకి. దాసుకి కడుపులో గాభరాగా అయింది. పోకిరివాళ్ళనే ఆడాళ్ళెక్కువ యిష్టపడతారేమో అనిపించింది. అతనికేదో తెలియకుండానే తెలిసిపోతోంది. ఆయమ్మ తనని చూస్తుందేమోనని ముఖం మీంచి తువ్వాలు పాగా చుట్టాడు. దొంగ కోళ్ళ గాడు బేరమేమి ఆడలేదు. ఎగిరి రిక్షాలో పడ్డాడు. ఆమె అతని పక్కన.

విధి లేనట్టు రిక్షా కదిలింది.

దాసుకి విపరీతమైన నిస్సత్తువ ఆవహించింది. తనెందుకు బేరం ఒప్పుకున్నానా అని కంగారు మొదలైంది.

దేవమ్మ అతన్ని గుర్తించే స్థితిలో లేదు. ఆమె కసలు అతను తెలియనే తెలియదు.

"నీ నగలేమైనా తెచ్చావా"

"ఆ....తెచ్చాను"

"నీ సర్టిఫికెట్లు అన్నీ వున్నాయా"

"ఆ... వున్నాయి"

"మరేం భయంలేదు"

ఇద్దరూ మరీ చేరువైనట్లు - మరేదో జరిగినట్లు. రామదాసు వొళ్ళంతా కారం రాసినట్లు. కంపరంగా చిరచిరలాడిపోయింది-

"పిల్లల్ని వదిలి వచ్చేస్తున్నాను" ఆమె గుసగుస - అతనేదో సముదాయిస్తున్న ధ్వని.

దాసుకి కాండ్రించి వుమ్మాలనిపించింది. ఇన్నాళ్ళూ తను దేవమ్మ అనుకున్నామె దయ్యంలా కనిపించింది. చదువు సంధ్యలు లేని దాసుకి ఈ చదువులన్నీ తగలెట్టాలని పించింది. ఎప్పుడూ బతిమాలుతూ వుండే బాబుగారి ముఖం వాడికళ్ళకు కట్టింది. అందమైన రాక్షసిని దేవమ్మలో చూస్తున్నాడు వాడు -

వాడిలో అసహ్యం పెల్లుబికింది. ఒక దీపస్తంభం దగ్గర అకస్మాత్తుగా రిక్షా ఆగింది. చీకట్లోంచి వెలుగులోకి వచ్చినట్లు దాసనుకున్నాడు.

"ఏం? ఏమైంది? తొరగా పోనీ" అన్నాయి రెండు కంఠాలూ ఏకమై.

"బండి ఎల్లదండి. మరో బండి ఎక్కండి" అంటూ దాసు సీటు దిగాడు.

"ఏం?" దొంగకోళ్ళ గొంతులో ఆత్రుత.

"నా ప్రాణం బాగోలేదండి"

మళ్ళీ అతనేదో మాట్లాడబోయాడు.

"దిగండయ్యా సంపక" అన్నాడు అందులో ఎంతో విసుగు ధ్వనించింది. ఏమనుకున్నారో యిద్దరూ దిగి చీకట్లో కలిసిపోయారు.

లేచిపోయిన పెళ్ళాం తాలూకు మొగుడు మర్నాడు ఈ సంఘంలో ఎంత అవమానం పొందుతాడో!

ఏం జరిగిందో తెలీని పసిపిల్లలు తల్లికోసం ఎలా తల్లడిల్లిపోతారో, అతనూహించి కలగిపోతున్నాడు. అతనికున్న పరిధిలో అతనికి కొన్ని నీతులున్నాయి, నియమా లున్నాయి, ఆత్మవిమర్శలు న్యాయ నిర్ణయాలు వున్నాయి, బయటపడి ఆ భార్యాభర్తలు విడిపోయినా దాసు యింత అసహ్యించుకునేవాడు కాదేమో!

ఆలోచించుకుంటూ, ఆవేదన పడిపోతూ దాసు యింటివైపు తిరిగాడు. అతనెప్పుడూ అలాంటి జంటని బండెక్కించుకోడు.

"రేత్రంతా రానన్నావుగా" అని కళ్ళు నులుపుకుంటూ తలుపు తీసింది దుర్గ.

"ఏం? వస్తే నీకేమైనా అడ్డా?" అన్నాడు. ఆ మాట చురుక్కుమని తగిలి, దుర్గ నిద్ర వదిలిపోయింది.

"ఏందయ్యోయ్- జోరుమీదున్నావు" అంది కుండలోంచి మంచినీళ్ళు ముంచుతూ.

దాసేం మాట్లాడలేదు. మంచినీళ్ళందుకున్నాడు. దుర్గకేం అర్థం కాలేదు. కాస్సేపాగి "బేరాలేం కుదర్లేదా" అంది. దాసేం మాట్లాడలేదు.

"మీ దేవమ్మగార్నెక్కించుకుని చక్కర్లు కొట్టకపొయ్యావా డబ్బులు రాలేయి" అంది చిర్నవ్వుతో.

"ముయ్యెహే నోరు. అది దేవమ్మ కాదే దయ్యం. ఆయమ్మ కాలెడితే డబ్బులొచ్చినా అయి మనకొద్దులే" అన్నాడు విసురుగా.

దాసు వింత మాటలు దుర్గకి అర్థం కాలేదు. కళ్ళమీదకి నిద్ర ముంచుకొస్తుంటే, మొగుడి పక్కనే జేరి ముసుగుతన్నేసింది.

●